క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ

అయిజ: బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు, కొబ్బరిబోండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, అలంపూర్ నియోజకవర్గం ఐటీ సెల్ కన్వీనర్ నవీన్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు అంజి, పట్టణ ప్రధాన కార్యదర్శి పరశురాం, ఉపాధ్యక్షులు శేషు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల ప్రకటనపై హర్షం

అలంపూర్: మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గద్వాలలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ జిల్లాకు వరాలు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీకి రూ. 25 కోట్ల నిధులు కేటాయించారని వివరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహంలకు కృతజ్ఞలు తెలిపారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



గట్టు: మండలంలోని మాచర్లలో కంటి వెలుగు శిబిరం మంగళవారం కొనసాగింది. మొత్తం 149 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, నలుగురికి అద్దాలను పంపిణీ చేశారు. ఐదుగురికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీహెచ్ఓ ఊసేని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



అయిజ: ముఖ్యమంత్రి కేసీఆర్ అయిజ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25 కోట్లు ప్రకటించడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, వివిధ వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.25 కోట్లు ప్రకటించడంపై మంగళవారం శాంతినగర్‌లో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ కరుణ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

మల్దకల్: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. నెలనెలా వైద్యపరీక్షలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువులను విక్రయించిన రైతులకు రశీదులను ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలి

రాజోళి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పక్కన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నూతనంగా సీసీ రోడ్లు వేస్తున్న ఎల్లమ్మ గుడి, కస్తూర్బా గాంధీ పాఠశాల రోడ్ల వెంట పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే రోడ్లు దెబ్బతినవని తెలిపారు. అధికారులు రైతులతో చర్చించి పొలాల గుండా వెళ్తున్న సీసీ రోడ్ల కింద పైప్‌లైన్‌లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలకు వెళ్లేదెలా..?

- గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు



బైరాపురంలో పాఠశాలలకు రావాలని కోరుతున్న ఉపాధ్యాయులు(ఫైల్)

ఉండవెల్లి: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వం బడి ఈడు పిల్లలను బడిలో చేరేవిధంగా ప్రతిష్టాత్మకంగా బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులను బడిలో చేర్పించారు. అంతా బాగానే ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు బడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పరిస్థితి మొదటికే వచ్చింది. కొందరు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి పాఠశాలకు వెళ్తున్నారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేట్ వాహనాలలో వెళ్లలేక చదువులకు స్వస్తి పలకాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాలకు రహదారులు ఉన్నా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కాలినడకన పాఠశాలలకు చేరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు బస్సులు అధికంగా ఉండేవని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బస్సు సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘం నాయకులు బస్సుల కోసం అధికారులకు వినతులు అందజేసినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలు..

మండలంలో ఉండవెల్లి, తక్కశిల, బైరాపురం, బొంకూరు, పుల్లూరు గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలకు చుట్టు పక్కల ఉన్న గ్రామాల నుంచి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉండవెల్లి ఉన్నత పాఠశాలకు చిన్న ఆముదాలపాడు, కంచుపాడు, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల-1,2 విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. బైరాపురం పాఠశాలలో బస్వాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు, పుల్లూరులో కలుగొట్ల, మెన్నిపాడు విద్యార్థులు, బొంకూరులో కలుకుంట్ల, ఏ.బూడిదపాడు, మానవపాడు మండలానికి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. బస్సు సౌకర్యం లేక కాలినడకన వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు విద్యార్థులు వాపోయారు. మండలంలో మొత్తం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు 550కు పైగా ఉన్నారు. అందులో బాలికలే అధికంగా ఉనట్లు అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల అవస్థలు..

మండలంలో మూడు గురుకుల పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాల ఉన్నాయి. పుల్లూరులోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలకు బస్సు సౌకర్యం లేక పుల్లూరు స్టేజ్ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు కిలోమీటర్ల కాలినడకన వెళ్లక తప్పడం లేదు. కలుగోట్ల కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. సమయానికి ఆటోలు, జీపులు లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలంపూర్ చౌరస్తా నుంచి పోతులపాడు స్టేజ్ వరకు ప్రయాణించి కలుగోట్ల గ్రామానికి కాలినడకన చేరుకుంటున్నారు. ఉండవెల్లి గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలకు జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి రావడానికి ఒక కిలోమీటరు అక్కడి నుంచి మరో కిలో మీటరు నడవాల్సిందే.

బస్సు సౌకర్యం కల్పించాలి



పాఠశాలకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు నడవాల్సిందే. బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో పుస్తకాలు తడుస్తున్నాయి. కొందరు విద్యార్థులు పాఠశాలకు రావడం లేదు. సమయానికి పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం. వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి.

– రేణుక, మారమునగాల

ఉన్నతాధికారులకు విన్నవించాం..



విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశాం. గ్రామాలకు బస్సు సౌకర్యం లేక కొంతమంది విద్యార్థులు పాఠశాలలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– శివ ప్రసాద్, మండల విద్యాధికారి

అనుమతిలేని పాఠశాలలపై చర్య తీసుకోవాలి



కలెక్టరేట్ ఏఓ యాదగిరికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గద్వాల అర్బన్: అనుమతిలేని పాఠశాలలపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా, కార్యదర్శి హరీష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏఓ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, హాస్టళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొటుస్తున్నాయన్నారు. టాలెంట్, కాన్సెప్ట్, టెక్నో తదితర పేర్లతో ఆకర్షణీయమైన పేర్లతో మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, పుస్తకాలు, యూనిఫాం అందించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

మహిళా సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానం



అలంపూర్ చౌరస్తాలో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: మహిళా సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అలంపూర్ చౌరస్తాలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తోందన్నారు. విప్లవాత్మక పథకాలతో మహిళా సంక్షేమంలో దేశానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజీత, వైస్ ఎంపీపీ దేవన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఎంపీడీఓలు సాయిప్రకాష్, రమణరావు, గోవింద రావు, రవీందర్ రావు, సీడీపీఓ సుజాత, కమలమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అలంపూర్: మానవపాడు మండలం కొర్విపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి కుమారుడు జగదీష్ అనారోగ్యంతో కర్నూల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

గుంతలమయంగా రోడ్డు



ధరూరు - బూరెడ్డిపల్లి మధ్య బీటీ రోడ్డు పరిస్థితి

ధరూరు: మండల కేంద్రం నుంచి గట్టుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. మండలం నుంచి మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాలకు ఈ మార్గం గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడుగునా గుంతలు ఉండటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దాదాపు ఏడు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ధరూరు నుంచి మార్లబీడు సమీపంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ వరకు రోడ్డుకు మరమ్మతు చేయాలని రెండు మండలాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చడంతో వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బీటీ రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

నేడు బీజేపీ సంయుక్త మోర్చా



మాట్లాడుతున్న రాజగోపాల్

శాంతినగర్: వడ్డేపల్లి పురపరిధిలోని శాంతినగర్ కన్యకాపరమేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం బీజేపీ సంయుక్త మోర్చా సమావేశం నిర్వహిస్తునట్లు ఆపార్టీ అధికార జిల్లా ప్రతినిధి రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం వడ్డేపల్లి మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంల మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహులు, పిడుగు వెంకటేష్, అలంపూర్ పట్టణ కార్యదర్శి నరేష్, పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు..

అయిజ: గద్వాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాదని ఆరోపించారు. ఎన్నికల కోసమే వరాలు కురిపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన రూ.10 లక్షలను కూడా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నరసింహయ్యశెట్టి, గోపాల కృష్ణ, ప్రదీప్ కుమార్, భగత్, ఆంజనేయులు, గిడ్డన్న, యేసు, భీమన్న, వినోద్, మల్లేష్, రమేష్, దేశన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి మృతికి సంతాపం

గద్వాల రూరల్: మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల గద్వాల పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ భీంసేన్‌రావు ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సేవలను కొనియాడారు.

రాజోళి: మాజీ ఎమ్మెల్యే సీనియర్ టీడీపీ నాయకుడు కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి తీరనిలోటని తెలుగునాడు కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గజేందర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా, టీడీపీ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం



మల్దకల్: కల్యాణలక్ష్మి పేదలకు వరంగా మారిందని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ రాజారెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, వైస్ ఎంపీపీ పెద్ద వీరన్న, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఉండవెల్లి: మహిళతో పాటు ఆమె కుమారులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు అయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల ప్రకారం మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన పద్మమ్మ రోడ్డు పక్కల గుంత ఏర్పడటంతో మట్టిని పోసింది. దీంతో రాకపోకలను ఇబ్బందులు ఏర్పడ్డాయి. మట్టిని తొలగించాలని ఈ నెల 6 వ తేదీన ఆమె తమ్ములు చిన్న వెంకటేష్, పెద్ద వెంకటేష్‌లు ఆమెపై గొడవకు దిగారు. ఈ విషయమై పద్మమ్మపై దాడి చేస్తుండగా మహిళా కుమారులు అడ్డుకునేందుకు యత్నించారు. వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్న వెంకటేష్, పెద్ద వెంకటేష్, వారి కుమారులు, మహేష్, మధులపై ఎస్‌ఐ బాల్‌రాజు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ

మానవపాడు: మండలంలోని కొర్విపాడు గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి కుమారుడు జగదీష్ అనారోగ్యంతో కర్నూల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం బాధితుడిని పరామర్శించారు.

'సీఎం హామీలు కాగితాలకే పరిమితం'



సమావేశంలో మాట్లాడుతున్న అలూరు ప్రకాష్ గౌడ్

గద్వాల అర్బన్: గద్వాలలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అవుతాయని తెలంగాణ జనసమితి జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఆర్డీఎస్‌పై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. జిల్లాకు మెడికల్ కాలేజీ మాటలకే పరిమితమైందన్నారు. 99 ప్యాకేజీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని విమర్శించారు. బీచుపల్లి ఆయిల్ మిల్లు, గద్వాల పాలకేంద్రం, క్రీడాకారులకు క్రీడామైదానం జిల్లా ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక వసతులను పట్టించుకునే నాథుడే లేడన్నారు. గంపెడు ఆశలతో ఎదురు చూసిన నడిగడ్డ ప్రజలను ఉత్తుత్తి మాటలతో ఊదర గొట్టారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు వీరభద్రప్ప, వీరేష్ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



సిబ్బందిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలత

ఉండవెల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ పద్మలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా బాలికలు చదువుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం దోబీ, కార్మికులను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం



గట్టు-మాచర్ల గ్రామాల మధ్య దెబ్బతిన్న తారు రోడ్డు



ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు

గట్టు: మండలంలోని తారు రోడ్లు భారీ వాహనాల రాక పోకలతో ఛిద్రమవుతున్నాయి. మండల కేంద్రం సమీపంలో చేపడుతున్న భారత్‌మాల రోడ్డుతో పాటుగా గట్టు ఎత్తిపోతల పథకానికి ఉపయోగిస్తున్న టిప్పర్ల కారణంగా గట్టు మాచర్ల, గట్టు రాయకాపురం, గట్టు మల్దకల్, గట్టు గొర్లఖాన్‌దొడ్డి తారు రోడ్లు దెబ్బతింటున్నాయి. గట్టు మాచర్ల గ్రామాల మధ్యన ఉన్న తారురోడ్డు ఇసుక, కంకర టిప్పర్ల కారణంగా తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి దెబ్బతిన్న తారు రోడ్లకు మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బడిలో విద్యార్థుల చేరిక

ధరూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ఆయా పాఠశాలల్లో 120 మంది పిల్లలు పాఠశాలల్లో చేరినట్లు ఎంఈఓ సురేష్ తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి బడి బయట ఉన్న వారిని కలిసి విద్యా ప్రాముఖ్యాన్ని వివరించారన్నారు. దీంతో సత్ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు.

నేడు 3 కె రన్

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో బుధవారం ఉదయం 3 కె రన్‌ను నిర్వహించనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ రామ్ ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావునా చుట్టు పక్కల ప్రాంతాల యువకులు, ఆసక్తి గల వారు అధిక సంఖ్యలో పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయండి

అమరచింత: ఓటరు జాబితాలో ఓటర్ల పేర్లతో పాటు అడ్రస్‌లో తప్పులు ఉంటే వాటిని వెంటనే సరి చేయాలని తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటరు నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మర్ రివిజన్‌లో భాగంగా ఇంటింటి సర్వే కోసం బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్క బీఎల్ఓ తన ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి జాబితాలోని తప్పులను సరిచేస్తూ కొత్త ఓటరు నమోదు కోసం కృషి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వేగవంతంగా ఓటరు జాబితా సర్వేను పూర్తి చేసి ఇచ్చిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను కాపాడుకోవాలి

వనపర్తి: కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ ఆచారి కోరారు. మంగళవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ఆర్థిక ప్రొత్సాహం అందిస్తూ.. రూ.లక్ష అందించే విషయంలో దరఖాస్తు గడువు పెంచాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ముగియనుందని పేర్కొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

- పనులను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



దాసర్‌పల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

మల్దకల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పనులు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతుండటంతో పనుల వద్ద కూలీలతో జాతరను తలిపిస్తోంది. జాబ్‌కార్డులు ఉన్న కూలీలకు ఉపాధి హామీ పనులపై అధికారులు అవగాహన కల్పించడంతో సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఎక్కడ పనులు చేయాలో ముందస్తుగా ప్రణాళికలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ బాటపడుతున్నారు. గద్వాల నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 68,157 జాబ్‌కార్డులు ఉన్నాయి. జాబ్ కార్డు ఉన్న కూలీలు ప్రతి రోజు పనులకు వెళ్తున్నారు. మల్దకల్ మండలంలో ప్రస్తుతం 20 గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అలాగే మండల కేంద్రాలలో రోజుకు 50 నుంచి 100 వరకు, గ్రామాల్లో 30 నుంచి 50 మంది వరకు కూలీలు పనులకు తరలివెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో కూలీలు ముళ్లపొదల తొలగింపు, పొలాల చదును, చెరువులు, కుంటల పూడికతీత, పంట కాలువల్లో పేరుకున్న మట్టిని తొలగించడం, వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు, పశువుల షెడ్లను నిర్మాణం, పంట పొలాలు, ఆవాస గ్రామాలకు మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో దాదాపు యాసంగి పనులు పూర్తి అయ్యాయి. దీంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు పనులు చేస్తున్నారు.



పాల్వాయిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఆసరాగా ఉపాధి



ఉపాధి హామీ పనులతో కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంది. గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలందరు పనులకు వెళ్తున్నారు. ప్రతి రోజు పని దొరుకుతుంది. ఉదయం ఉపాధి కూలీ పనులు చేస్తూ మధ్యాహ్నం నుంచి ఇతర పనులు చేసుకుంటున్నా.

– రాఘవేంద్ర, బూడిదపాడు

సద్వినియోగం చేసుకోవాలి:

మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఉపాధి పనులపై ఇప్పటికే అవగాహన కల్పించాం. జాబ్ కార్డులు ఉన్న కూలీలు, యువత, మహిళలు పనులు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని గ్రామాల్లో పనులు మమ్మరంగా కొనసాగుతున్నాయి.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, మల్దకల్